# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## రూపాయి లేకుండా పట్టా వచ్చింది



లక్షలాది మంది రైతుల భూములకు భద్రత కల్పించింది ధరణి. రూపాయి ఖర్చు లేకుండా పట్టాదారు పాసుపుస్తకాన్ని ఇంటి వరకు తీసుకొచ్చి ఇస్తుంది బీఆర్ఎస్ ప్రభుత్వం. గతంలో పట్టా చేసుకోవాలంటే అధికారులకు లంచం ఇచ్చుకోవాల్సి వచ్చేది. ధరణి రాకతో దళారులు జాడ లేకుండా పోయింది. భూమిని కొని ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న మరుసటి రోజే తహసీల్ కార్యాలయంలో పేరున భూమి రిజిస్ట్రేషన్ అయ్యింది. రూపాయి ఖర్చు లేకుండా ఇంటికే పట్టాదారు పాసుపుస్తకం పోస్టు ద్వారా వచ్చింది.

**- హర్జ్యానాయక్, రైతు, పోచారం తండా**


# ధరణి తీసేస్తే కయ్యాలే..

# కాంగ్రెస్‌ను తరిమెయ్యాలె..

**ధరణి పోర్టల్‌ను** తీసేసి పాత రెవెన్యూ పద్ధతిని తీసుకొస్తామంటున్న కాంగ్రెస్ నేతలపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఏండ్లు పాలించిన కాంగ్రెసోళ్లు రైతుల మధ్య భూ తగాదాలు, పంచాయితీలు పెట్టి చోద్యం చూసిందే తప్పా.. ఏనాడూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపలేదు. చేయి తడిపితే చాలు పేర్లు మార్చి, దళారుల రాజ్యంలో రైతులను దగా చేసిన చేదు జ్ఞాపకాలు ఇంకా మదిలో ఉన్నాయంటున్నారు. పదేండ్లలో సీఎం కేసీఆర్.. ధరణి అనే అద్భుతమైన వ్యవస్థను రూపొందించి రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిండు. పటేల్, పట్వారీ వ్యవస్థను రూపుమాపి, యజమాని వేలిముద్రతో నిమిషాల్లో రిజిస్ట్రేషన్ అయ్యే పద్ధతి తెచ్చిండు. రూపాయి లంచం లేకుండా, పారదర్శకంగా సత్వర సేవలందిస్తున్న ధరణిని తీసేస్తామని చెబుతున్న కాంగ్రెస్‌ను తరిమేస్తామని రైతులు తేల్చిచెబుతున్నారు. రైతుల మధ్య భూ పంచాయితీలు పెట్టాలని చూస్తున్నట్లు కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు ఉన్నాయంటూ మండిపడుతున్నారు.

- పటేల్, పట్వారీ వ్యవస్థతో భూ పంచాయితీలే..
- రైతులంటే కాంగ్రెసోళ్లకు ఎందుకంత పగ?
- హస్తం పార్టీపై రైతన్నల ఆగ్రహం

## ధరణిని తొలగిస్తే ఊరుకునేది లేదు



బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి రైతుల భూములకు భద్రత కల్పించే గొప్ప వ్యవస్థ. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా రైతు భూములకు భరోసా కల్పించే వ్యవస్థ లేదు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తాము అధికారంలోకి వస్తే ధరణిని తొలగిస్తామని ప్రకటన చేయడం సరికాదు. ధరణిని రద్దు చేస్తే ఊరుకునేది లేదు.

**-ముదిరెడ్డి విఠల్‌రెడ్డి, రైతు, బాన్సువాడ.**


## ఆఫీసుల చుట్టూ తిరిగే రోజులు పోయాయి



భూములను మా పేరున రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగే వాళ్లం. ధరణి రాకతో పాత రోజులు పోయాయి. భూమి కొన్న వెంటనే దళారుల జోక్యం లేకుండా రిజిస్ట్రేషన్ అవుతున్నది. గతంలో వీఆర్వోలు చెప్పిందే వేదంలా ఉండేది. పైసలు ముట్టజెప్పినా పనులు కాలేదు. ధరణి రావడంతో మా భూములకు రక్షణ ఏర్పడింది.

**- మైబూబ్, రైతు, బోర్లం.**

## భూములు లాక్కునేందుకు కాంగ్రెస్ కుట్ర




ధరణిని తొలగించి రైతుల భూములను లాక్కునేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తున్నది. రైతుల భూములు భద్రంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారు. ధరణిని తొలగిస్తే రైతులంతా తిరగబడతారు. రైతులను ముంచే కుట్రకు కాంగ్రెస్ పార్టీ పూనుకున్నది. అలాంటి కాంగ్రెస్‌ను అధికారంలోకి రానివ్వం.

**- లచ్చయ్య, రైతు, బోర్లం.**

ధరణి

## బీఆర్ఎస్ వస్తేనే బాగుంటుంది..



కాంగ్రెసోళ్ల పాలనలో పట్వారీ వ్యవస్థతో అనేక కష్టాలు పడ్డాం. సీఎం కేసీఆర్ వచ్చినంక ఆ బాధలు తప్పినయ్. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే బాగుంటుంది. కాంగ్రెస్‌తో అష్టకష్టాలు పడ్డాం. గతంలో వీఆర్వోలు రాసిందే లెక్క. వీఆర్వోలు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో అనేక మంది రైతులు నష్టపోయారు. ఒకరి పేరును ఉన్న భూమిని మరొకరి పేరుకు బదిలీ చేస్తూ రైతులకు నష్టం కల్గించారు. రైతుల భూముల లెక్కలు పక్కాగా ఉండాలనే సంకల్పంతో తీసుకొచ్చి ధరణితో మా భూములకు భద్రత లభించింది.

**- బస్వయ్య, రైతు, రాంపూర్**


## కాంగ్రెస్ వస్తే మళ్లా పరేషానే ....



ఒక దబన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు కష్టాలు మళ్లా చాలయినట్లే. పనికోసం పోతే చెప్పులరిగే దాక తిరుగాలె. కాంగ్రెస్ వచ్చేనంటే మళ్లా పాత రోజులే వస్తయి. ధరణి పాయేనంటే ఎవరి ఆస్తులు ఎవరి పేరుమీద మారుతాయో తెల్వది. మళ్లా పట్వారీలు వస్తారు. మళ్లా పైసలు దొబ్బుతరు. ధరణి ఉంటే లంచాలు ఉండవు. దళారుల బాధ ఉండది. మొత్తానికి రైతు పొలం కొన్నా అమ్మినా అనుకున్న టైంకు రిజిస్ట్రేషన్ పెట్టుకోవచ్చు. ముఖ్యంగా కేసీఆర్ వచ్చినంక రైతులకు ఆఫీసుల పొంట, సార్ల వెంట తిరిగే బాధ పోయింది.

**- నారాయణ రెడ్డి, రైతు, పాత బాన్సువాడ**


## ధరణి పోతే రైతులకు తిప్పలు..



సమైక్యపాలనలో లంచాలు ఇస్తే చాలు ఒకరి ఆస్తి, మరొకరి పేరుమీద రికార్డులల్ల మారిపోతుండె. భూమి లొల్లిలు ఉన్నవారు పోలీస్ స్టేషన్లు, కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఉండె. కానీ ఇప్పుడు కేసీఆర్ హయాంలో అటువంటి ఇబ్బందులు లేవు. కాంగ్రెస్ వస్తే మళ్లా పాత కథ మొదలైతది. ఒకవేళ కాంగ్రెస్‌ను గెలిపిస్తే అవకతవకలు మళ్లా చాలయితయి. ఎట్టి పరిస్థితుల్లో ధరణిని పోనిచ్చేది లేదు. కేసీఆర్ తప్పా ఇంకెవ్వరూ గెలువొద్దు. అప్పుడే రైతులు కాలుమీద కాలేసుకొని కూసోవచ్చు. లొల్లి, పంచాయితీలు ఉండవు.

**- మహేశ్, రైతు, బాన్సువాడ**

## తెల్లింకు పెట్టి పట్టాలు మార్చిన పరిస్థితులు..



ధరణి తీసేస్తం అంటున్నరు కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఎందుకు మళ్లా.. రైతులను మోసం చేసి ఒకని పొలాలు మరొకని పేరు మీద రాసుకునేతందుకా, అప్పట్లనే పనికావాలంటే ఎమ్మార్వో ఆపీస్ పొంట తిరిగితిరిగి చెప్పులు అరుగుతుండే. పట్వారీలు దొరికితే దొరుకకపోదురు. ధరణి లేనప్పుడు పహాణీలను తెల్లింకు పెట్టి దిద్ది పరేషాన్ల పడేశింర్రు. ధరణి తీసేస్తే ఇగ ఎవరి ఆస్తి వారికి తెల్వకుండ ఇంకొకరు బడానాయకుల పేర్ల మీదకు ఎక్కుతాయి. కాంగ్రెస్ పార్టీకి ప్రజలకు మంచి చేసే చేత కాదుగని, పనికిరాని ఆలోచనలు చేసి రైతులను నట్టేట ముంచే పనిచేస్తుంది. గిసుంటోళ్లు గనుక గెలిస్తే రైతుల బతుకులు ఆగం అయితాయి. కేసీఆర్ చేసిన మంచి పనులకు బీఆర్ఎస్ సర్కార్ వస్తేనే ప్రజలకు మంచి జరుగుతది.

**- వీరారెడ్డి, రైతు, పాత బాన్సువాడ**

## ధరణితో ఎంతో మేలు..



తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులకు చాలా మేలు జరుగుతుంది. ధరణితో రైతు భూమికి పక్కా భరోసా ఉంటుంది. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఆ పత్రాలను వీఆర్వోలకు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండే. వారు రికార్డులోకి ఎక్కించే వరకు ఎమ్మార్వో ఆఫీస్‌లకు తిరిగే పరిస్థితి. ఇప్పుడు నేరుగా రిజిస్ట్రేషన్ కాగానే నిమిషాల్లో రికార్డుల్లోకి ఎక్కిస్తున్నారు. చాలా సౌలత్. ధరణి లేకపోతే మన భూమి మన మీద ఉంటదా లేకా రాత్రికిరాత్రే వేరేటోళ్ల పేరుమీద మారుతుందో తెల్వదు. పహాణీలు రాసినప్పుడంతా అవినీతి ఉండె. ఇప్పుడు కేసీఆర్ సారు తీసుకొచ్చిన ధరణి మంచి వ్యవస్థ.

**- ప్రదీప్ పంతులు, దామరంచ, బీర్కూర్**